క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం

మధిర: క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసం ఉంటుందని మధిర సీఐ జాటోత్ వసంత్ కుమార్ తెలిపారు. సంక్రాంతి పండుగను పరిష్కరించుకొని వైరా రోడ్డులో యరగొర్ల గోపాలరావు ట్రస్ట్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న కమిటీ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

క్రీడల్లోనూ రాణించండి..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: చదువుతో పాటు యువత క్రీడల్లోనూ రాణించాలని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని అయ్యగారిపేట వీఆర్ క్రికెట్ బాక్స్ నిర్వాహకుల ఆధ్వర్యంలో బుధవారం డేఅండ్‌నైట్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉమ్మడిజిల్లా పరిధిలోని 17 టీమ్‌లు పోటీపడగా సత్తుపల్లి లెవన్ బులెట్స్ టీమ్ విజయం సాధించింది. కెప్టెన్ ఎం.అనీల్‌కుమార్ ప్రథమ బహుమతిగా రూ.10వేలు గెలుచుకున్నారు. రన్నర్‌గా నిలిచిన ఖమ్మం ఆల్ఫాలెవన్ టీమ్‌కు రూ.5వేలు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో బి.మధుసూన్‌రాజు, జి.రామకృష్ణ, పి.నాగేశ్వరరావు, కె.భరత్, జనకనూరి సంతోష్, సాయికిరణ్, సుమంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతి


ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వెంకన్నకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వైరా: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ.. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి గురువారం ఖమ్మంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వెంకన్నకు వినతిపత్రం అందించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఆదేశాల మేరకు వైరా నుంచి గండగలపాడు, లక్ష్మీపురం, సిరి పురం మీదుగా దాచాపురం వరకు.. వైరా నుంచి సోమవరం, రెబ్బవరం మీదుగా దాచాపురం వరకు బస్సు సర్వీసులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డ పుల్లయ్య, మట్టూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కొణిజర్ల: తన భూమిని కౌలుకు చేసి ఇప్పుడు తనదేనంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండలంలోని పెద్దరాంపురానికి చెందిన ఆలకుంట రమేష్ తహసీల్దార్ తఫజల్ హుస్సేన్‌కు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో తన తండ్రినుంచి సంక్రమించిన 27.5 కుంటల భూమిని తన అనారోగ్య కారణంగా అదే గ్రామానికి చెందిన దావా రవికుమార్‌కు 3 ఏళ్ల వరకు కౌలుకు ఇవ్వగా.. ఇప్పుడు పొలం నాదే అంటూ.. తన సోదరుడు విజయ్‌తో కలిసి చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. అదే విధంగా సమాదుల కోసం ఉంచిన తమ స్థలాన్ని దావా విజయ్‌కుమార్, రవికుమార్‌లు ఆక్రమించుకోని బెదిరిస్తున్నారని దావా జనార్దన్, బసవయ్య, ప్రసాద్, రమేష్, సత్యనారాయణ, ఉపేందర్‌లు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

కొణిజర్ల: మండలంలోని ఎస్సీకాలనీ పక్కనే నిర్వహిస్తున్న రైస్ మిల్లు కారణంగా కాలుష్యానికి గురై శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నామని ఆ కాలనీ మహిళలు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ తఫజుల్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. శ్రీనివాసా ట్రేడర్స్ పేరుతో కాలనీ పక్కనే ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా భారీ లెవీ ట్రేడింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారని, దుమ్ము ధూళి వల్ల తామంతా అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు పోటీలు

కల్లూరు: ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించే స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణా సేవాసమితి నిర్వాహకులు కొమ్మూరి దర్గయ్య, ఉప్పు నరసింహారావు, బలుసుపాటి వెంకటేష్, ఎస్కే సాధిక్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తనికెళ్లలో రక్తదాన శిబిరం

కొణిజర్ల: సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో తనికెళ్లలో భవన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది ఈ శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి లేడిబోయిన గోపాలరావు, సీఎస్‌సీ హెల్త్ కేర్ ప్రతినిధి ప్రవీణ్ సంపత్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగింట.. సంబరాల పంట

ముగ్గుల సంక్రాంతి..
పల్లెల్లో కొత్త క్రాంతి

- భోగిమంటలు, రంగు, రంగుల ముగ్గులు
- రక రకాల పిండి వంటలు
- అరిసెలు ప్రత్యేకం


తల్లాడలో అరిసెలు చేస్తున్న మహిళలు


తల్లాడలో భోగి మంటలు (ఫైల్)

ప్రతి ఏటా కొత్త ధాన్యం ఇంటికి వచ్చిన తర్వాత వచ్చే మొదటి పండుగ మకర సంక్రాంతి. ఇంటిల్లిపాది ఆనందాలతో మూడు రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ.. ఎన్నో మధురానుభూతులను సంవత్సరమంతా ఇచ్చే పండుగ. ముత్యాల ముగ్గులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆట ఈ పండుగ ప్రత్యేకత.

తల్లాడ: భోగి మంటలు, పిండి వంటలు, రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల ఎగరవేతతో పిల్లల కేరింతలు పండుగ సందడి వచ్చేసింది. సంబరాల సంక్రాంతి పండుగతో ఇళ్ల ముందు వాకిళ్లు రంగు, రంగుల ముగ్గులతో గొబ్బెమ్మలతో కొత్తదనాన్ని తెస్తుంది. మూడు రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ కొత్త శోభను సంతరించుకుంటుంది. సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో పట్టణ వాసులు పల్లెలకు చేరుకుంటారు. పల్లెల్లో ఈ పండుగను కుటుంభ సభ్యుల సమక్షంలో జరుపుకోవటం ఆనవాయితీ. 14న భోగి, 15న మకర సంక్రాంతి, 16న కనుమను సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. భోగి రోజు తెల్లవారుజామున 3 గంటల నుంచి యువత భోగి మంటలు వేసి చుట్టూ తిరుగుతారు. ఇక ఈ మూడు రోజుల పాటు మహిళలు రంగు రంగుల ముగ్గులు వేస్తారు. తమ ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేసి వాటికి రంగులు దిద్ది వాటిలో బంతి పూలు, రేగిపండ్లు, కూరగాయలు వేసి గొబ్బెమ్మలను పెడతారు. ఇక ఇంటిల్లి పాది, వీధిలో ఉన్న పలు కుటుంబాల వారు ఒక చోట చేరి పిండి వంటలు తయారు చేసుకొని ఆరగిస్తారు. సంక్రాంతి స్పెషల్ అరిసెలు. నువ్వుల అరిసెలు మరింత స్పెషల్‌గా తయారు చేస్తారు. వాటికి తోడు సకినాలు, చక్రాలు, చెక్క గారెలు, కారప్పూస, వివిధ రకాల స్వీట్స్‌ను వారి వారి స్టైల్లో తయారు చేసుకుంటున్నారు.

బెల్లం, బియ్యం పిండి అరిసెలు ప్రత్యేకం ..

బెల్లంతో బియ్యం పిండిని పాకం పట్టి అరిసెలు ప్రత్యేకంగా తయారు చేస్తారు. గ్రామాల్లో వారం రోజుల పాటు ఇలా పిండి వంటల్లో నిమగ్నమైతారు. ప్రతి వీధిలో పదిమంది కలిసి ఒకరికొకరు సహాయం చేసుకుంటూ అరిసెలు తయారు చేస్తుంటారు. ఈ అరిసెలపైన తెల్ల నువ్వులు ఉంచి చేస్తారు. నువ్వుల వేసిన అరిసెలు చూడటానికి ఎంతో చక్కగా ఉంటాయి. నూనె మరియు నేతితో తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన అరిసెలు ఎంతో రుచిగా.. ఎక్కువ రోజులు ఉంటాయి.

ముగ్గుల, క్రికెట్ పోటీలు..

సంక్రాంతి సందర్భంగా జిల్లాలో పలు పట్టణాల్లో ముగ్గులు, క్రికెట్ తదితర పోటీలు నిర్వహిస్తారు. పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే ఈ పోటీలు ప్రారంభమై పండుగ రోజుతో ముగుస్తాయి. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు కూడా అందిస్తారు. రంగు రంగుల ముగ్గుల పోటీలు చూడ ముచ్చటగా ఉంటాయి.

– గాలిపటాల ఎగర వేతతో పిల్లలు కేరింతలు కొడతారు. గతంలో పిల్లలు సొంతంగా తయారు చేసుకొని దానికి దారం కట్టి ఆకాశంలోకి ఎగురవేసేవారు. ఇప్పుడు అలా కాకుండా రెడిమేడ్ గాలి పటాలు వచ్చాయి. దీంతో పిల్లలు షాపుల వద్దకు వెళ్లి గాలి పటాలను కొని ఎగురవేస్తున్నారు. సంక్రాంతి పండుగ ఈ ఏడాది కొత్త సందడిని నింపుతుందని ఆశిద్దాం!

ఆనందంగా జరుపుకుంటాం..



ప్రతి ఏటా జనవరిలో వచ్చే సంక్రాంతికి పంటలు ఇంటికి చేరతాయి. కుటుంబ సభ్యులు, బంధువులతో గ్రామాల్లో పండుగ మూడు రోజులు ఉంటుంది. కూతుళ్లు, అల్లుళ్లు, అలాగే పట్టణాల్లో ఉండే వారు పల్లెలకు (సొంతూళ్లు) చేరుకొని రంగుల, రంగుల ముగ్గులు వేస్తారు. గ్రామాల్లో ముగ్గుల పోటీల్లో పాల్గొంటారు.

– మోటమర్రి రాజమాత, మిట్టపల్లి

సమష్టిగా జరుపుకొనే పండుగ..



సంక్రాంతి పండుగ పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు సమష్టిగా జరుపుకొనే పండుగ. గాలి పటాలు ఎగరవేయడం, ముగ్గులు వేయడం, భోగి మంటలు, పిండి వంటలు తయారు చేయడం ఈ పండుగ స్పెషల్. ముఖ్యంగా మహిళలు పదిమంది కలిసి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. ఐక్యత, ఆనందాన్ని పంచే సరికొత్త సంక్రాంతి ఇది.

– యన్నం శ్రీలక్ష్మి, రామానుజవరం

గురుకుల ఎంట్రన్స్ కరపత్రాలు ఆవిష్కరణ


ప్రవేశ పరీక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి, తదితరులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో గురువారం ఐదో తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులకు సమాచారం అందించే కరపత్రాలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేది వరకు ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తుకు గురుకులాల సొసైటీ అవకాశమిచ్చినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల గురుకులాల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కోట లోకేశ్వరరావును శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పొట్టపింజర చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు గుడేటి బాబురావు, సభ్యులు సగ్గుర్తి ముత్యాలరావు, సగ్గుర్తి మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ..

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) నూతన సంవత్సర 2024 డైరీలను, క్యాలెండర్లను గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.ముత్తయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసే విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలని భర్తీ చేయాలని, పదోన్నతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ హనుమంతరావు, భాస్కర్, సీతారాములు, గురుమూర్తి, సురేష్, సూర్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

పెనుబల్లి: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసన మండలి స్థానానికి జరగబోయే ఉప ఎన్నికలకు పెనుబల్లి మండలంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ గంటా ప్రతాప్ తెలిపారు. 01–11–2020 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 6లోపు స్వయంగా గానీ, లేదా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా గానీ ఫారం 18ను పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి అటెస్టు చేసిన గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత ధృవీకరణ పత్రం, అసెంబ్లీ నియోకవర్గ ఓటరు కార్డు ప్రతి, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను జతచేయాలని తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు.. దరఖాస్తు చేసుకోండి

కారేపల్లి: తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను, 6వ తరగతిలో 100 సీట్లకు గాను, 7వ, 8వ, 9వ, 10వ తరగతిలో ఏర్పడిన ఖాళీలకు గాను, ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 22వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి గురువారం అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర చేరుకుంది. అయోధ్య రాముని ఆశీస్సులు ప్రతి ఇంటా ఉండాలనే ఉద్దేశంతో నిజామాబాద్ పీఠాధిపతి విశోక తీర్థస్వామి, శివ రామక్రిష్ణ తపోవనం చేపట్టిన అన్నారుగూడెం గ్రామానికి చేరుకుంది. ఈ శోభాయాత్రకు గ్రామంలో ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో గోవిందు శ్రీనివాసరావు, పులి అనంతరామయ్య, వెంకటేశ్వర్లు, కోసూరి వేలాద్రి, గోవింద్ మురళి, రాజేష్, వెంకటేశ్వరరావు, సైదులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరులో పాతకక్షల నేపథ్యాన ఘర్షణకు దిగిన ఇద్దరిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మొగిలి అశోక్, మాధవరావు ఘర్షణ పడి పరస్పరం దాడి చేసుకోవడమే కాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

వేధిస్తున్న భర్తపై...

మండలంలోని పందిళ్లపల్లిలో పోతరాజు సునీతను ఆమె భర్త శ్రీను కొంతకాలం నుంచి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. దీంతో సునీత ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సీహెచ్‌పీలో ఫిట్ మీటింగ్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఓసీ–2లో పని చేస్తున్న సింగరేణి కార్మికులు ఎస్కే ఖాజా, ఎస్.శ్రీనివాస్, టి.రామస్వామి, సీహెచ్ కోటేశ్వరరావు, ఎం.అజయ్, బి.అశోక్, ఈపీ ఆపరేటర్ ఐ.వి.రెడ్డిలు యూనియన్‌లో చేరారు. వీరికి ఆ యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించింది. కార్యక్రమంలో రామారావు, పీఎస్ నాగేష్, రాఘవులు, నాగరాజు, జె.రాజేశ్వరరావు, సుబ్రమణ్యం, అప్పారావు, బాలాజీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదేళ్లు సస్పెండ్

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన దొడ్డ బాబూరావు, ఊటుకూరి రంజిత్ అనే ఇద్దరు వ్యక్తులు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి పార్టీ అనుమతి లేని పనులు నిర్వహించినందుకు, పార్టీ నాయకులను ఇష్టా రీతిన విమర్శించినందుకు జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు 5 ఏళ్ల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె నారాయణరావు తెలిపారు. మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల విచారణ అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మిషన్ భగీరథ కార్మికుడి మృతికి సీఐటీయూ సంతాపం

వైరారూరల్: మండలంలోని విప్పలమడక గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన మిషన్ భగీరథ కార్మికుడు అక్కిశెట్టి శ్రీనివాసరావు భౌతికాయానికి గురువారం మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నం వెంకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాపగంటి రాంబాబు, సీఐటీయూ బాధ్యులు పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం అక్కిశెట్టి శ్రీనివాసరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో మిషన్ భగీరథ కార్మికులు రామయ్య, శ్రీనివాసరావు,మధు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


ఎర్రుపాలెం: బంజరలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రమేష్

తల్లాడ: తల్లాడ మండలంలోని అంబేడ్కర్‌నగర్, బిల్లుపాడు గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ.. అర్హులందరికీ కేంద్ర పథకాలను అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లుపాడు సమావేశానికి పదిమంది కూడా హాజరుకాలేదు. ఇలా జరగడానికి కారణం ప్రచార లోపమే కారణమని తెలిసింది. ఈ సమావేశంలో ఎస్‌బీఐ మేనేజర్ ఇబ్రహీం, ఏపీజీవీబీ మేనేజర్ శివ సతీష్, డాక్టర్ విజయ్ చందర్, కేవీకే శాస్త్రవేత్త శ్రీలత, ఆర్థిక అక్షరాస్యత కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, డాక్టర్ నీలిమ, బీజేపీ మండల అధ్యక్షులు వెంకటరామారావు పాల్గొన్నారు.

బంజర, కండ్రిక గ్రామాల్లో..

ఎర్రుపాలెం: మండలంలో బంజర, కండ్రిక గ్రామాల్లో మధిర క్లస్టర్ కోఆర్డినేటర్ కటికల రమేష్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించి అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి పుష్పలత, మండల వ్యవసాయాధికారి కె.విజయభాస్కర్ రెడ్డి, ఏఈఓ ప్రసన్న, హెచ్‌ఈఓ సదాశివరావు, ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీ లత, సర్పంచులు రంగా, నాగమణి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.నర్సింహా, వి.శ్రావణి తదితరులు ఉన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు..


పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

పెనుబల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యం అందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించడం తగదని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గురువారం ఆమె పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి.. ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యుల, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. వైద్యురాలునైన తాను తరచూ ఆస్పత్రిని పర్యవేక్షిస్తుంటానని, ఆసుపత్రిలో వైద్య సేవలు, ఇతర సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ రంజింత్‌కుమార్, డాక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం చేయాలి..

కల్లూరు మండలం కుర్నవల్లికి చెందిన మహిళను ఆ గ్రామంలోని కొందరు తీవ్రంగా కొట్టారని తనకు న్యాయం చేయాలంటూ ఆ మహిళ ఎమ్మెల్యేని కోరగా.. మహిళ గోడు విని అక్కడే ఉన్న ఏసీపీ రామానుజం, సీఐ హనూక్‌కు వివరాలు సేకరించి న్యాయం చేయాలని సూచించారు. అదే విధంగా టేకులపల్లి మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.నాగరాజు, స్థానిక నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, అలుగోజు చిన్నస్వామి, మాధవరెడ్డి, వెంకటేశ్వరరావు, నవజీవన్, బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక


సామాజిక తనిఖీలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న అధికారులు

బోనకల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూ మంత్రంగా సాగింది. మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిర్వహించి ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మోటమర్రి, ఆళ్లపాడు, రాపల్లి, రావినూతల, గార్లపాడు, రామాపురం, చొప్పకట్లపాలెం, నారాయణపురం, చిన్నబీరవల్లి, కలకోట గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తనిఖీ బృందంలోని సభ్యులు సభలో ప్రవేశపెట్టారు. మస్టర్లపై సంతకాలు లేకుండా బిల్లులు చెల్లించినట్లు వెల్లడైంది. వర్క్ జరిగిన ప్రదేశాలకు సంబంధించిన ఫొటోలు లేకపోవడంతో పనులపై అనుమానం వ్యక్తం చేశారు. ఇన్‌పుట్ డేటా షీట్లు సమర్పించలేదని డీఆర్పీలు తెలియజేశారు. గ్రామ సభలలో అనేకమంది జాబ్‌కార్డులు కావాలని దరఖాస్తులు చేసుకున్నారని.. చేసిన పని కొలతలకు, మస్టర్ కొలతలకు చాలా వ్యత్యాసం ఉన్నట్లు తెలిపారు. హరితహారం కింద వేసిన మొక్కలు ఎక్కడా లేకపోవడంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఓ అదనపు పీడీ శిరీష మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో మస్టర్లు లేకుండా బిల్లులు చెల్లించినట్లు సామాజిక తనిఖీలో తేలిందన్నారు. ఈ ప్రజావేదికలో 21 వేలు పెనాల్టీ వేయగా.. 20 వేలు రికవరీ చేసినట్లుగా తెలిపారు. ఈ సభలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ బోడెపూడి వేణుమాధవ్, ఏపీడీ వెంకట్రాజు, ఎంపీడీఓ అశోక్, ఏపీఓ కృష్ణకుమారి, వైస్‌ఎంపీపీ రమేష్, ఈసీ కిరణ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారుల ఇరుముడి


వైరారూరల్: తాటిపూడిలో ఇరుముడి ధరించిన మాలధారులు

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలో గురువారం అయ్యప్ప స్వామి మాలదారుల ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అల్లిక కాటంరాజు అయ్యప్ప మాలధారులకు శబరిమలై రవాణా ఖర్చుల నిమిత్తం నగదుతో పాటు పండ్లను అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అయ్యప్ప స్వామి మాలధారులు పాల్గొన్నారు.

పల్లిపాడులో..

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడులో అయ్యప్ప మాలధారులు ఇరుముడి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన తాటిపల్లి పిచ్చయ్య గురుస్వామి, కొమ్మినేని సతీష్ గురుస్వామిల నేతృత్వంలో 25 మంది అయ్యప్ప మాలధరించి 45 రోజుల పాటు నిష్ఠతో పూజలు చేసి గురువారం స్థానిక శివాలయంలో ఇరుముడి కట్టుకుని శబరిమలైకు బయలుదేరి వెళ్లారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి

ఏన్కూరు: అంగన్‌వాడీ టీచర్లు ఎటువంటి లోపాలు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని.. లేనిచో శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి అన్నారు. మండల పరిధిలోని లచ్చగూడెంలోని రైతువేదికలో పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాల నిర్వహణపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో రూపొందించవలసినటువంటి అభ్యాసన మూలలు ఏలా ఏర్పాటు చేసుకోవాలో వివరించారు. ఇవి ఏర్పాటుకు ఐదు రోజుల కాలపరిమితి ఇస్తున్నట్లు తెలిపారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చింతకాని: విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌బాబు సూచించారు. మండల పరిధిలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. రానున్న వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కళాశాలలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పర్వదిన వేడుకలను పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థునులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు, తోరణాలు, హరిదాసు వేషధారణ, గంగిరెద్దుల ప్రదర్శన, కోడి పందేలు, గాలిపటాలు, పల్లె వాతావరణం ఉట్టిపడేలా ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు తెలుగు పండుగల ప్రాముఖ్యతను వివరించి విజేతలకు బహుమతులు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా మధు విద్యాలయంలో.. ముగ్గులు వేస్తున్న విద్యార్థులు


మధిర: భరత్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు


సత్తుపల్లిటౌన్: విశ్వశాంతి స్కూల్‌లో గంగిరెద్దుతో విన్యాసాలు


కొణిజర్లలో పతంగులతో చిన్నారుల సందడి


కల్లూరు: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం